సాక్షి
ఒడిశా

గురువారం । 25 । సెప్టెంబర్ । 2025



దాండియా నృత్యాలు

పర్లాకిమిడిలో దాండియా నృత్యాలు చేశారు. దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

- IIలో▸



ఘనంగా ఎన్ఎస్ఎస్‌డే

జయపురం విక్రమ్‌దేవ్ వర్సిటీలో ఎన్ఎస్ఎస్‌డే నిర్వహించారు. అధికారులు పాల్గొన్నారు.

- IIలో▸



మహిళా కాంగ్రెస్ విజృంభణ

మహిళా కాంగ్రెస్ విజృంభించింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన చేసింది.

- IIలో▸

ముంచెత్తిన వాన



మోకాలి లోతు నీటిలో జన జీవనం అస్తవ్యస్తం



బొలంగీరులో శుఖజర్ వంతెనపై నుంచి ప్రవహిస్తున్న వాన నీరు

- బంగాళా ఖాతంలో అల్పపీడనం
- రాష్ట్రంలో అతి భారీ వర్షాలు
- ఉప్పొంగిన హీరాకుద్ జలాశయం
- జన జీవనం ప్రభావితం

భువనేశ్వర్: బంగాళాఖాతంలో అల్పపీడనం ఫలితంగా రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. జలాశయాల్లో నీటి మట్టం గణనీయంగా పెరుగుతోంది. బంగాళా ఖాతంలో అల్పపీడనాలు ఒకదాని వెంబడి మరొకటి ఏర్పడడంతో పరిస్థితి మరింత విపత్కరంగా మారుతోంది. ఈ నెల 25న మరో అల్పపీడనం ఏర్పడేందుకు అనుకూల వాతావరణం నెలకొని ఉంది. ఇది బలపడి వాయుగుండంగా మారితే రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. 26వ తేదీ నాటికి ఇది వాయువ్య, దాన్ని ఆనుకుని ఉన్న పశ్చిమ-మధ్య బంగాళా ఖాతం, దక్షిణ ఒడిశా, ఆంధ్ర తీరాల మీదుగా వాయుగుండంగా మారుతుందని వాతావరణ శాఖ అంచనా. 27వ తేదీన దక్షిణ ఒడిశా, ఉత్తర ఆంధ్ర తీరాలను దాటుతుంది. 30వ తేదీన ఒడిశాకు ఆనుకుని ఉన్న వాయువ్య బంగాళా ఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడుతుంది. ఇది ఒడిశా తీరానికి సమీపంలో సముద్రంలో ఉత్తరం వైపు కదులుతుంది.

భారీ వర్ష సూచన

రాష్ట్రంలో పలు ప్రాంతాలకు భారీ వర్ష సూచన జారీ అయింది. అతి భారీ వర్షపాతం సూచనతో వాతావరణ శాఖ 3 జిల్లాలకు నారింజ హెచ్చరిక జారీ చేసింది. ఈ జాబితాలో కొరాపుట్, నవరంగ్‌పూర్, నువాపడా ప్రాంతాలు ఉన్నాయి. మల్కన్‌గిరి, కంధమల్, కలహండి, రాయగడ, గంజాం, గజపతి, బాలా సోర్ ప్రాంతాలకు కు పసుపు పచ్చ హెచ్చరిక జారీ చేశారు. నారింజ, పసుసు పచ్చ హెచ్చరిక జిల్లాలలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. రాష్ట్రంలో కోస్తా, పశ్చిమ, అంతర్గత ఒడిశాలో కూడా వర్షాలు కురిసే అవకాశం ఉంది.

వాన ముంపులో పశ్చిమ ఒడిశా

పశ్చిమ ఒడిశాలో అల్ప పీడనంతో తెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు సాధారణ జన జీవనం ప్రభావితం చేస్తున్నాయి. సంబల్‌పూర్‌లో రికార్డు వర్షపాతం నమోదైంది. ఈ ప్రాంతంలో గత 24 గంటల్లో 177.1 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. హిరాకుద్‌లో 163.6 మిల్లీ మీటర్లు, బర్‌గడ్‌లో 112.6 మిల్లీ మీటర్లు, నువాపడాలో 92.6 మిల్లీ మీటర్లు, మల్కన్‌గిరిలో 75.2 మిల్లీ మీటర్లు, సోనపూర్‌లో 63.6 మిల్లీ మీటర్ల వర్షపాతం రికార్డు అయింది.

నీట మునిగి తేలుతున్న బొలంగీరు

అల్పపీడన వర్షాలతో బొలంగీర్ ప్రాంతం విపరీతంగా ప్రభావితమైంది. ధండముండా ప్రాంతం అస్తవ్యస్తంగా మారింది. ధండముండా పంచాయతీ ఖప్రఖోల్ మండలంలో భారీ వర్షం కురుస్తుండగా పలు చోట్ల చెట్లు రహదారిపై కుప్ప కూలడంతో రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. ఖప్రఖోల్ అగ్నిమాపక శాఖ సిబ్బంది ఘటనా స్థలం సందర్శించి చెట్లను నరికి తొలగించి వాహన రవాణా పునరుద్ధరించారు. హరిశంకర్‌ను కలిపే శుఖజర్ వంతెనపై నుంచి వాన నీరు ప్రవహిస్తోంది. హరిశంకర్, బెనెకెరా మధ్య రాకపోకలు, రవాణా పూర్తిగా దెబ్బతిన్నాయి.

నిండిన హిరాకుద్ జలాశయం



హిరాకుద్ జలాశయం నీరు విడుదల

హీరాకుద్ జలాశయం నీటి మట్టం గణనీయంగా పెరిగింది. అంచెలంచెలుగా ఆనకట్ట గేట్లు తెరిచి వరద నీరు విడుదల చేస్తున్నారు. బుధవారం మరో 4 గేట్లు గుండా వరద నీరు విడుదల చేస్తున్నారు. దీంతో ప్రస్తుతం 12 గేట్ల ద్వారా వరద నీరు విడుదల అవుతుంది. జలాశయం నీటి మట్టం 629.97 అడుగులు. ప్రతి సెకనుకు జలాశయంలోనికి 2 లక్షల 5 వేల 426 క్యూసెక్కుల నీరు ప్రవేశిస్తోంది. 1 లక్ష 67 వేల 307 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఈ నెల 28 వరకు మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లడం నిషేధించి చేపల వేట నివారించారు.



పశ్చిమ ఒడిశాలో పలు చోట్ల ఇండ్ల లోనికి ప్రవహించిన వాన నీరు



సంబల్‌పూర్ ప్రాంతంలో నీట మునిగిన వాహనాలు



ఖప్రఖోల్ పంచాయతీలో నడి రోడ్డు మీద కూలిన చెట్టు

న్యూస్‌రీల్

178 కిలోల గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలతో పోలీసు సిబ్బంది

రాయగడ: జిల్లాలోని గుడారి సమీపంలో ఉభ్న జలనిధి అడవుల్లో గంజాయి అక్రమ రవాణా జరుగుతున్న సమాచారాన్ని తెలుసుకున్న పోలీసులు మంగళవారం సాయంత్రం ఆకస్మిక దాడులను నిర్వహించారు . దాడులు చేసిన సిబ్బందికి రవాణాకు సిద్ధంగా ఉన్న 178.250 కిలోల గంజాయి పట్టుబడింది. అయితే పోలీసుల రాక గమనించిన గంజాయి మాఫియా పరారైనట్లు సమాచారం. పట్టుబడిన గంజాయని స్వాధీనం చేసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మృతదేహం లభ్యం



పార్వతీ కులసిక మృతదేహం

రాయగడ: జిల్లాలోని మునిగుడ పోలీస్‌స్టేషన్ పరిధి రామిసామిల్ కెనాల్ వద్ద మహిళ మృతదేహాన్ని పోలీసులు మంగళవారం సాయంత్రం స్వాధీనం చేసుకున్నారు. అటువైపుగా వెళుతున్న కొందరు మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం సంఘటన స్థలానికి మునిగుడ ఎస్‌డీపీవో సంతోషిణి ఒరం, ఐఐసీ సౌదామిని బెహర తదితరులు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం మృతురాలు మునిగుడలోని రాజీవ్‌పదర్ ప్రాంతానికి చెందిన పార్వతీ కులసిక (48 గా గుర్తించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైన్స్ పార్క్ ఏర్పాటుకు వినతి



రాష్ట్రమంత్రి పాత్రోకు వినతిపత్రం అందజేస్తున్న హికక

రాయగడ: జిల్లాలోని బిసంకటక్‌లో సైన్స్ పార్క్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే నీలమాధవ హికక కోరారు. ఈ మేరకు రాష్ట్ర పౌరసరఫరాలు, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల మంత్రి క్రిష్ణ చంద్ర పాత్రోను బుధవారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. భువనేశ్వర్‌లో మంత్రిని మర్యాదపూర్వకంగా కలసిన హికక అభివృద్ధి పరంగా ముందడుగు వేస్తున్న బిసంకటక్‌లో విద్యార్థులు ఆధునిక, సాంకేతిక పరంగా మరింత ముందుకు వెళ్లేలా దోహదపడే సైన్స్ పార్క్ ఆవశ్యకతకు సంబంధించి చర్చించారు. స్పందించిన మంత్రి త్వరలో దీనిపై సమీక్షిస్తానని హామీ ఇచ్చినట్లుగా ఎమ్మెల్యే హికక ఒక ప్రకటనలో వెల్లడించారు.

కలిమెల ఎక్సైజ్ కార్యాలయం ఘెరావ్



కలిమెల ఎక్సైజ్ కార్యాలయాన్ని ముట్టడించిన మహిళలు

మల్కన్‌గిరి : మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి పశుగూఢ పంచాయతీ పరిధిలో ఉన్న ఎక్సైజ్ కార్యాలయాన్ని బుధవారం పుశుగూఢ, కోయిమేట్ల, ఉంద్రుకొండ పంచాయతీలకు చెందిన వందలాది మంది మహిళలు ఘెరావ్ చేశారు. ఎక్సైజ్ కార్యాలయ సిబ్బంది ఖాళీ డ్రమ్‌లు, కుండలను పెట్టి నాటుసారా అమ్ముతున్నట్లు కేసులు పెడుతున్నారు. దీనిపై మహిళలు ఫిర్యాదు చేశారు. ఈ ఆరోపణలపై వివరణ కోరగా కార్యాలయ ఇన్‌చార్జి దీపక్ సామల్ ఖండించారు. ఇకపై ఇలాంటి జరగబోవని చెప్పడంతో మహిళలు వెనుదిరిగారు.

ప్రభుత్వ ఉద్యోగులకు దసరా కానుక

- ముందస్తుగా జీతాల చెల్లింపు

భువనేశ్వర్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ముఖ్యమంత్రి దసరా కానుక ప్రకటించారు. దసరా సంబరంగా జరుపుకునేందుకు ఉద్యోగులకు ఈ నెల జీతం ముందుగానే చెల్లిస్తారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రభుత్వ ఉద్యోగులకు దుర్గా పూజకు ముందుగానే జీతం లభిస్తుంది. ఉద్యోగులకు ఈ నెల జీతం 26న చెల్లించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సాధారణంగా రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రభుత్వ ఉద్యోగులకు నెల చివరి పని దినాన జీతం లభిస్తుంది. దుర్గా పూజలు పురస్కరించుకుని ఈ నెల 27 నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు మూసివేస్తారు. దసరా వంటి పండుగల కాలంలో కుటుంబ వ్యవహారాల కోసం వివిధ రకాల కొనుగోలు చేస్తారు. ఈ సంవత్సరం ద్రవ్య సేవా పన్ను (జీఎస్‌టీ) 2.0 సంస్కరణ తర్వాత దేశం బచత్ పండుగను జరుపుకుంటోంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రస్తుత నెల జీతం 26వ తేదీ నాటికి చెల్లించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

కాంగ్రెస్ అవిశ్వాస తీర్మానం తిరస్కరణ

భువనేశ్వర్: శాసన సభ స్పీకర్ సురమా పాఢి మరోసారి కాంగ్రెస్ ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానం తిరస్కరించారు. కొనసాగుతున్న వర్షాకాలం సభా సమావేశాలను పురస్కరించుకుని కాంగ్రెస్ రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా శాసన సభ కార్యదర్శి ద్వారా అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టింది. దురదృష్టవశాత్తు సభ తొలి రోజు నుంచి అర్ధంతరంగా వాయిదా పడడంతో కాంగ్రెసు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానంపై చర్చకు అనుకూలించ లేదు. కాలయాపన కావడంతో అవిశ్వాస తీర్మానం తిరస్కరించినట్లు స్పీకరు ప్రటించిన విషయం తెలిసిందే. ఈ పరిస్థితుల్లో కాంగ్రెసు మరోసారి యథాతథంగా అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదన నీరుగారి పోయింది. కొనసాగుతున్న సమావేశాల్లో ఒకే శీర్షికపై రెండు సార్లు అవిశ్వాస తీర్మానం ఆమోదయోగ్యం కాదని స్పీకరు సుతిమెత్తగా తిరస్కరించారు. మళ్లీ యథాతథంగా అవిశ్వాస తీర్మానం ప్రతిపాదనకు ఆరు నెలలు వ్యవధి అవసరమని పేర్కొన్నారు.

మావోల చేతిలో మృతి చెందిన ఎమ్మెల్యేకు నివాళులు



సాయుధ స్థూపం వద్ద నివాళులు అర్పిస్తున్న గిరిజనులు

కొరాపుట్: మావోయిస్టుల చేతిలో గతంలో మృతి చెందిన ఎమ్మెల్యేకి ఘనంగా నివాళులర్పించారు. బుధవారం నబరంగ్‌పూర్ జిల్లా రాయిఘర్ సమితి గుణ గ్రామంలో భారీ బహిరంగ సభ జరిగింది. 15 ఏళ్ల కిందట ఇదే రోజు ఇక్కడ సంత జరుగుతుండగా నాటి బీజేడీకి చెందిన ఉమ్మర్‌కోట్ ఎమ్మెల్యే జగబంధు మజ్జి వచ్చారు. సంతలో గిరిజనుల సమస్యలు వింటుండగా ముసుగులో వచ్చిన మావోయిస్టులు కాల్చి చంపారు. ఎమ్మెల్యేను రక్షించడానికి ప్రయత్నం చేసిన బాడీగార్డు ప్రశాంత్ కుమార్ పాత్రోని కూడా కాల్చి చంపారు. నాడు ఈ ఘటన దేశ వ్యాప్తంగా సంచలనం కలిగించింది. నడవలేని స్థితిలో చక్రాల కుర్చీకి పరిమితమైన దివ్యాంగ గిరిజన ఎమ్మెల్యేను వందలాది ప్రజల సమక్షంలో మావోయిస్టులు కాల్చి చంపడం చర్చనీయాంశంగా మారింది. నాటి ఘటనకు గుర్తుగా దళిత్ సమాజ్ ఇక్కడ సాయుధ అమర స్థూపం నిర్మించింది. నాటి నుంచి ఏటా సంతాప సభ నిర్వహిస్తోంది. నాటి ఘటనలో జగబంధు కారు డ్రైవర్‌గా సుభాష్ గొండ్ అదే స్థానంలో రెండు సార్లు బీజేడీ ఎమ్మెల్యేగా గెలుపొందారు. బుధవారం సుభాష్ నేతృత్వంలో జరిగిన సభకి మాజీ మంత్రి రమేష్ మజ్జి, బీజేడీ, దళిత్ సమాజ్ నాయకులు భారీ సంఖ్య లో తరలి వచ్చారు.



బహిరంగ సభ వద్ద అమరుల చిత్ర పటాలకు నివాళులు అర్పిస్తున్న మాజీ మంత్రి రమేష్, మాజీ ఎమ్మెల్యే సుభాష్



భారీ వర్షంలో నివాళులు

8 అడుగుల కొండచిలువ పట్టివేత



పట్టుకున్న కొండచిలువతో యువకులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా మాత్తిలి సమితి దళపతిగూఢ పంచాయతీ డైగూడ గ్రామంలో బుధవారం ఉదయం ఎనిమిది అడుగుల కొండ చిలువల హల్‌చల్ చేసింది. గ్రామానికి చెందిన ఓ రైతు తన పొలంలో వరి పైరుకు ఎరువు వేసేందుకు వెళ్లాడు. అయితే పొలంలో ఉన్న పామును చూడకుండా దానిపై కాలువేయడంతో అతనిపై దాడికి ప్రయత్నించింది. అప్రమత్తమైన ఆయన పొలం నుంచి బయటకు వచ్చేసి సమీపంలో ఉన్న రైతులకు విషయాన్ని తెలియజేశాడు. వారంతా కలిసి అటవీశాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అయితేవారు వచ్చేలోగా కొండచిలువ గ్రామంలోకి చొరబడేందుకు ప్రయత్నించగా కొంతమంది ధైర్యం చేసి దాన్ని పట్టుకున్నారు. ఇంతలో స్నేక్ హెల్ప్‌లైన్ ప్రతినిధులు అక్కడకు చేరుకున్నారు. అటవీశాఖ సిబ్బంది ఆదేశాల మేరకు పామును సమీపంలోని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.

మహిళల భద్రతా చట్టాలపై అవగాహన



మహిళా చట్టాలపై అవగాహన కల్పిస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజేష్‌కుమార్ మిశ్రా

పర్లాకిమిడి: మహిళల భద్రత, వారి హక్కులు తెలియజేసే నల్సా (జాతీయ న్యాయ సేవా అథారిటీ) చైతన్య శిబిరాన్ని స్థానిక మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం జరిగింది. న్యాయ సేవా సచేతన కార్యక్రమానికి జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి బిమల్ కుమార్ రవుళో ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. మహిళల మౌలిక హక్కులు, భద్రత, వైవాహిక సంబంధమైన విడాకులు, మనోవృత్తిపై బిమల్ రవుళో వివరించారు. జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజేష్ కుమార్ మిశ్రా మాట్లాడుతూ.. నారీమణుల యవ్వనంలో జరిగే దాడులు, శారీరిక లైంగిక వేధింపులు, అత్యాచారాలకు పాల్పడే వారిపై 112 టోల్ ఫ్రీ లేదా 15100 నంబరుకు డయల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో సఖీ వన్ స్టాప్ సెంటర్ ప్యానల్ న్యాయవాది సునీతా రోథో, సునీతా బెహేరా పోలీసు ఎస్సై కృత్తికా శెఠి పాల్గొని వారిని సంప్రదించాల్సిన నంబరును విద్యార్థులకు అందజేశారు. సభకు అధ్యక్షత వహించిన మహిళా కళాశాల ప్రెసిడెంటు డాక్టర్ రీనా సాహు బాల్యవివాహాలు మూఢ నమ్మకమని, నారీ మణుల హక్కులను హరించివేస్తుందని విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం కళాశాల ఆవరణలో న్యాయ సేవా ప్రాధికరణ కార్యదర్శి బిమల్ రవులో మొక్కలను నాటారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, ఉద్యోగులు, జిల్లా జడ్జికోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న విద్యార్థినులు



మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో మొక్కలను నాటుతున్న అధికారులు

ప్రధాన మంత్రి పర్యటన ఏర్పాట్లపై సమీక్ష



ఝార్సుగుడ ప్రాంతంలో ప్రధాని పర్యటన ఏర్పాట్లు సమీక్షించిన మంత్రి సురేష్ కుమార్ పూజారితో ప్రభుత్వ ఉన్నతాధికారులు

భువనేశ్వర్: భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 27న ఝార్సుగుడ పర్యటనకు రానున్నారు. ఈ సందర్భంగా అమ్లిపాలి మైదానంలో బహిరంగ సమావేశంలో యువతని ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఈ నేపథ్యంలో బహిరంగ సభా ప్రాంగణంలో శాంతిభద్రతలు, వేదిక, సభా స్థలం, వాహనాల పార్కింగ్ తదితర సన్నాహాలను రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ విభాగం మంత్రి సురేష్ కుమార్ పూజారి బుధవారం ప్రత్యక్షంగా సందర్శించి సమీక్షించారు. ఆయనతో ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా, రాష్ట్ర పోలీస్ అదనపు డైరెక్టర్ జనరల్ సంతోష్ బాలా పాల్గొన్నారు. వీరంతా ప్రత్యేక విమానంలో ఝార్సుగుడ విమానాశ్రయానికి ఉదయం 11.30 గంటల ప్రాంతంలో చేరుకుని నేరుగా ప్రతిపాదిత సమావేశ వేదికకు చేరుకున్నారు. అక్కడ ఉత్తర ప్రాంతం రెవెన్యూ కమిషనర్ సచిన్ రామచంద్ర యాదవ్, పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్ హిమాన్షు లాల్, జిల్లా మేజిస్ట్రేట్ కునల్ మోతీరామ్ చౌహాన్, పోలీసు సూపరింటిండెంట్ గుండాల రెడ్డి రాఘవేంద్ర, హోం కార్యదర్శితో కలిసి సన్నాహాలపై చర్చించారు. ప్రధానమంత్రి సమావేశ వేదిక పరిసరాల ప్రాంగణాల్లో ఏర్పాట్లు క్షుణ్ణంగా పరిశీలించారు. లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు పకడ్బందీగా ఉండేలా జాగ్రత్త వహించాలని అనుబంధ వర్గాలను మంత్రి ఆదేశించారు. కార్యక్రమం శాంతియుతంగా విజయవంతం అవుతుందని అధికారుల బృందం తెలిపింది.

ప్రధాని కార్యక్రమాలు

ఈ నెల 27వ తేదీ ఉదయం 11 గంటలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఝార్సుగుడ విమానాశ్రయంలో దిగి నేరుగా సమావేశ వేదిక వద్దకు చేరుతారని రెవెన్యూ మంత్రి సురేష్ కుమార్ పూజారి తెలిపారు. దాదాపు 1 గంట పాటు జరిగే ఈ కార్యక్రమంలో అనేక ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసి ప్రారంభోత్సవం చేస్తారు. యువజన సభలో యువజన బృందాన్ని ఉద్దేశించి ప్రధానమంత్రి ప్రసంగిస్తారని రెవెన్యూ మంత్రి తెలిపారు.

క్లుప్తంగా

శ్రీనివాసరావుకి సాహితీ కిరీట పురస్కారం


శ్రీనివాసరావు

జయపురం: జయపురం కవి, పాత్రికేయుడు సింహాద్రి శ్రీనివాసరావుకి సాహితీ కిరీట పురస్కారం లభించింది. అంతర్జాతీయ సాహితీ సంస్థ శ్రీశ్రీ కళావేది క అధ్యక్షుడు కత్తిమండ ప్రతాప్, శ్రీశ్రీ కళావేదిక జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరీభూషణ్ ఆధ్వర్యంలో ఈ పురస్కారానికి శ్రీనివాసరావును ఎంపిక చేశారు. ఆ విషయాన్ని ఆయనకు తెలియజేశారు. ఈ నెల 28వ తేదీన హైదరాబాద్‌లోని బిర్లా ఆడిటోరియంలో నిర్వహించనున్న తెలుగు సాహితీ పురస్కార ఉత్సవంలో పాల్గొనాలని ఆహ్వానం పంపారు. ఆ ఉత్సవంలో సాహితీ కిరీట పురస్కారంతో శ్రీనివాసరావును సన్మానిస్తారు. శ్రీనివాసరావుకి అవార్డు లభించటంతో జయపురం సాహితీప్రియులు, బంధువులు, స్నేహితులు అభినందిస్తున్నారు.

హోంగార్డుకి దొరికిన వెండి వస్తువులు


దొరికిన వెండి బ్రాస్‌లైట్లతో హోంగార్డు మహేష్

కొరాపుట్: హోంగార్డుకి రెండు వెండి బ్రెస్‌లైట్లు బుధవారం దొరికాయి. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని మెయిన్ రోడ్డులో గల మా బండారు ఘరణి శక్తి పీఠం వద్ద దసరా శరన్నవరాత్రులు ఘనంగా జరుగుతున్నాయి. దేవిని దర్శించడానికి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అక్కడ హోంగార్డు ఎ.మహేష్ విధుల్లో ఉన్నారు. రోడ్డు మీద పడి ఉన్న రెండు బ్రాస్‌లైట్లుని గమనించి స్వాధీనం చేసుకున్నారు. వాటి యజమానులు తమ ఆధార్ కార్డులతో వస్తే అందజేస్తానని సోషల్ మీడియాలో ప్రకటించారు. మహేష్ చేసిన ఈ పనికి నెటిజన్లు అభినందిస్తున్నారు. ఇటీవలే ఇదే జంక్షన్‌లో అగ్ని ప్రమాదం జరిగితే ప్రాణాలు తెగించి మంటల్లో చొరబడి గ్యాస్ సిలిండర్లను ప్రమాదం నుంచి తప్పించి మన్ననలు పొందారు.

పర్లాకిమిడిలో దాండియా నృత్యాలు


దాండియా నృత్యంలో చిన్నారులు, మహిళలు

పర్లాకిమిడి: దసరా ఉత్సవాలు పర్లాకిమిడిలో సందడిగా ప్రజలు జరుపుకుంటున్నారు. స్థానిక గ్రామదేవత నీలమ్మ గుడిలో బుధవారం దుర్గాదేవిని ప్రతిష్ఠించి అఖండ దీపాలను భక్తులు వెలిగించారు. మహిళలు, చిన్నారులు దాండియా నృత్యం చేస్తూ ఆనంద డోలికల్లో మునిగిపోయారు. ఈ నవరాత్రి ఉత్సవాల్లో ప్రతిరోజూ సాయంత్రం మ్యూజిక్ సౌండ్స్‌తో దాండియా నృత్యాలు చేస్తూ పిల్లలు పెద్దలు ఆనందిస్తున్నారు.

సారా బట్టీలపై దాడులు

● నలుగురు అరెస్టు


గారబందలో పట్టుబడిన సారా

పర్లాకిమిడి: జిల్లాలోని గుసాని, గారబంద గ్రామాల్లో ఎక్సైజ్, పోలీసులు, ఎగ్జిక్యూటివ్ మాజిస్ట్రేట్ సంయుక్తంగా బుధవారం దాడులు జరిపారు. ఈ దాడుల్లో సారా, ఐడీ లిక్కర్, ఇతర సారా వంట సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. నలుగుర్ని అరెస్టు చేసి వారిపై కేసులు పెట్టినట్టు జిల్లా ఎస్పీ జ్యోతింద్ర పండా తెలియజేశారు.

లిక్విడ్ లారీ బోల్తా

జి.సిగడాం: రాజాం నుంచి చిలకపాలెం వైపు వెళ్తున్న లిక్విడ్ లారీ వాంద్రంగి రైల్వే వంతెన వద్ద బుధవారం రాత్రి బోల్తా పడింది. దీంతో రోడ్డుపై ప్రయాణిస్తున్న వారు భయాందోళనకు గురయ్యారు. చీకటిలో ఆ లిక్విడ్ ఏమి టన్నది తెలియకపోవడంతో ఆందోళన పెరిగింది.


ఉత్సాహంగా శరన్నవరాత్రులు


అన్నపూర్ణ అవతారంలో లక్ష్మీదేవి

రాయగడ: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం అమ్మవారు అన్నపూర్ణ అవతారంలో భక్తులకు దర్శనభాగ్యం కలిగించారు. స్థానిక కస్తూరీ నగర్‌లోని సత్యానారయణ మందిరం ప్రాంగణంలో లక్ష్మీ అమ్మవారిని ఈ సందర్భంగా అన్నపూర్ణ అమ్మవారిగా అలంకరించారు. అలాగే కస్తూరీ నగర్ ఏడో లైన్‌లో అమ్మవారిని ప్రత్యేకంగా పూజిస్తున్నారు. స్వాగత్ హోటల్ సమీపంలోని కోదండ రామ మందిరంలో డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో భారత నాట్య ప్రదర్శన భక్తులను అలరించింది. పిల్లలు తమ ప్రతిభను చాటుకునే విధంగా భరతనాట్య నృత్యాలు ప్రదర్శించారు.


అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు


నృత్య ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులు


కస్తూరీనగర్‌లో కొలువుదీరిన అమ్మవారు

శీతల గిడ్డంగుల నిర్మాణానికి

రూ. 252 కోట్లు: మంత్రి

భువనేశ్వర్ :

రాష్ట్ర శాసన సభ వర్షాకాల సమావేశాల్లో బుధవారం కాసేపు ప్రశ్నోత్తరాలు సాగాయి. ఆ సమయంలో సభలో కాంగ్రెస్ సభ్యుల గోలతో గందరగోళం నెలకొంది. వ్యవసాయ శాఖ ప్రశ్నోత్తరాల సమయం జరుగుతుండగా, కాంగ్రెస్ సభ్యులు సభ మధ్యలోకి వచ్చి అలజడి సృష్టించారు. రాష్ట్రంలో మహిళలపై పెరుగుతున్న దారుణాలపై కాంగ్రెస్ నిరసన వ్యక్తం చేస్తుండగా ప్రశ్నోత్తరాలు కొనసాగించారు. ఈ పరిస్థితుల్లో ప్రశ్నోత్తరాలు కేవలం 30 నిమిషాలు మాత్రమే కొనసాగాయి. కాంగ్రెస్ గర్జన కారణంగా సభను ఉదయం 11.30 గంటల వరకు వాయిదా వేసినట్లు స్పీకర్ ప్రకటించారు.

స్పీకర్ అభ్యర్థన

ప్రశ్నోత్తరాల సమయాన్ని కొనసాగనివ్వాలని స్పీకర్ సురమా పాఢి కాంగ్రెస్ శాసన సభ నాయకుడు రామచంద్ర కదమ్‌ను అభ్యర్థించారు. స్పీకర్ తన స్థానంలో నిలబడి ఈ అభ్యర్థన చేశారు. స్పీకర్ పోడియం కింద కాంగ్రెస్ సభ్యులు గందరగోళం కొనసాగించారు.

త్వరలో 58 సబ్ డివిజన్లలో శీతల గిడ్డంగులు

విపక్ష బిజూ జనతా దళ్ ఎమ్మెల్యే రణేంద్ర ప్రతాప్ స్వంయి ప్రశ్నకు స్పందిస్తూ అన్ని సబ్ డివిజన్లలో శీతల గిడ్డంగులు నిర్మిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తెలిపారు. ఇదో పంచ వర్ష ప్రణాళిక అని, దీని కింద ఐదేళ్లలో శీతల గిడ్డంగులు నిర్మాణానికి బడ్జెటులో రూ. 252 కోట్లు కేటాయించారు. 58 సబ్ డివిజన్లలో ప్రభుత్వ , ప్రైవేటు భాగస్వామ్యంతో (పీపీపీ) శీతల గిడ్డంగులు నిర్మిస్తారు. ఈ విషయంలో గో సుగమ్ యాప్‌లో 13 దరఖాస్తులు దాఖలు అయ్యాయి. వాటిలో మూడింటిని పరిశీలించి తదుపరి కార్యాచరణ కొనసాగించేందుకు అనుమతించారు. వీటిలో పూరీ, జాజ్‌పూర్, సువర్ణపూర్ జిల్లాల్లో ఒక్కొక్కటి ఉన్నట్లు మంత్రి పేర్కొన్నారు.


శాసన సభ ప్రశ్నోత్తరాల్లో బీజేడీ ఎమ్మెల్యే రణేంద్ర ప్రతాప్ స్వంయి


సభ్యుల ప్రశ్నలకు బదులు ఇస్తున్న వ్యవసాయ, రైతు సాధికారిత విభాగం మంత్రి కనక వర్ధన్ సింగ్ దేవ్

ఎరువులు పుష్కలం

రాష్ట్రంలో ఎరువుల కొరత కృత్రిమ సృష్టి. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు 2 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ఎరువులను అందించింది. ఎరువుల కోసం బూటకపు ఉద్యమం సృష్టించారని వ్యవసాయ శాఖ మంత్రి అన్నారు. ఎంత మంది ఎమ్మెల్యేలు ఎరువుల ఉద్యమ స్థలానికి వెళ్లి సమీక్షించారని ఆయన సభలో విపక్షాలను నిలదీశారు.

రాష్ట్రంలో మూలుగుతున్న మిగులు బియ్యం

ఖరీఫ్ సాగుకు ముందు మిగులు బియ్యం విషయంలో సభలో అధికార, ప్రతిపక్షాల మధ్య జరిగిన వాగ్వాదంతో సభలో ఉద్రిక్తత నెలకొంది. సభలో ప్రతిపక్ష ఉప నాయకుడు ప్రతాప్ కేశరి దేవ్ ప్రశ్నకు ఆహార, పౌర సరఫరాల మంత్రి కృష్ణ చంద్ర పాత్రో సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో 13 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం మిగులు ఉంది. కేంద్ర ప్రభుత్వం మిగులు బియ్యాన్ని తీసుకోవాలని అభ్యర్థించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకోకపోతే రాష్ట్ర ప్రభుత్వం ఆ బియ్యం వేలం వేయాలని యోచిస్తోంది. 11 జిల్లాలకు అదనంగా 3 నెలల బియ్యం పంపిణీ చేశారు. రాష్ట్రంలో 63 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఉత్పత్తి అయింది. ఇందులో 50 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఉపయోగించారు. ఎనిమిదేళ్లలో కేంద్రం నుంచి 8 వేల కోట్ల రూపాయలు బకాయి రావాల్సి ఉందని మంత్రి తెలిపారు.

ఖాతాదారుని డబ్బు కాజేసిన కేసులో..

పోస్టుమాస్టర్‌కు మూడేళ్లు జైలు

● రూ. 2 వేల జరిమానా

పర్లాకిమిడి: గజపతి జిల్లా నువాగడ బ్లాక్ ఖోజురిపద పోస్టల్ శాఖలో పనిచేస్తున్న పోస్టుమాస్టర్ కార్తికేశ్వర్ పాయక్ ఓ ఖాతాదారుడు దాచుకున్న డబ్బు రూ.47,241 మాయం చేశాడు. దీనిపై సెరంగో పోలీసు స్టేషన్‌లో 1999లో జనవరి 22 కేసు నమోదైంది. ఈ కేసును విజిలెన్సు ఇన్‌స్పెక్టర్ సురేంద్రనాథ్‌పండా, సెరంగో పోలీసు స్టేషన్ ఎస్ఐ కె.వి.ఆర్. నాయుడు, బిష్ణుపద మహంతి దర్యాప్తు చేశారు. నిందితుడు కార్తికేశ్వర్ పాయక్‌ను కోర్టులో హాజరు పరిచారు. అనంతరం కోర్టులో నిందితుడు పోస్టుమాస్టర్‌ను విచారించిన న్యాయస్థానం దోషిగా తేల్చింది. అయితే ఈ తీర్పును సవాల్ చేస్తూ పోస్టుమాస్టర్ జిల్లా కోర్టుకు అప్పీల్ చేసుకున్నాడు. అనంతరం ఆర్.ఉదయగిరి కోర్టుకు వచ్చిన ఈ కేసు బుధవారం ఫైనల్ హియరింగ్‌కు వచ్చింది. నిందితుడు పోస్టుమాస్టర్‌కు వ్యతిరేకంగా 12 మంది సాక్షులు కోర్టులో సాక్ష్యం చెప్పడంతో సీనియర్ జడ్జి సౌదమినీ బిశ్వాల్ మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 2 వేల జరిమానా విధించారు. ఒక వేళ నిందితుడు రూ.2 వేల జరిమానా కట్టకపోతే మరో ఆరు నెలలు జైలు శిక్ష విధిస్తూ తీర్పుచెప్పారు. ఈ కేసును ప్రభుత్వం తరఫున ఏపీపీ హరికృష్ణప్రధాన్ వాదించినట్లు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజేష్‌కుమార్‌మిశ్రా తెలిపారు.

ఇన్‌టాక్‌తో సెంచూరియన్ వర్సిటీ ఒప్పందం


ఎంఓయూ పత్రాలతో ఇన్‌టాక్ చైర్మన్ అశోక్ సింగ్ ఠాకుర్, వర్సిటీ రిజిస్ట్రార్ అనితా పాత్రో

పర్లాకిమిడి: ఆర్.సీతాపురం సెంచూరియన్ వర్సిటీలో బుధవారం ఎన్.ఎస్.ఎస్.దినోత్సవం పురస్కరించుకుని భారతీయ జాతీయ ఆర్ట్, కల్చర్, వారసత్వ ట్రస్టుతో ఒప్పందం (ఎం.ఓ.యు.) కుదుర్చుకుంది. సెంచూరియన్ వర్సిటీ బోర్డు మీటింగ్‌లో జరిగిన ఒప్పందంలో ఇన్‌టాక్ చైర్మన్ అశోక్ సింగ్ ఠాకుర్, సెంచూరియన్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ అనితా పాత్రో, డైరెక్టర్ డాక్టర్ దుర్గాప్రసాద్ పాడి సంతకాలు చేసి పరస్పరం ఒప్పంద పత్రాలను అందిపుచ్చుకున్నారు. ఇన్‌టాక్ ఒప్పందంతో సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో వారసత్వ విద్య, సాంస్కృతిక, శిక్షణ, సెమినార్లు, కర్మశాలలు, పరస్పరం జతీయ ఆర్ట్, కల్చర్, వారసత్వ ట్రస్టుతో ఇచ్చిపుచ్చుకుంటారు. తద్వారా గజపతి జిల్లాలో కల్చరల్ ప్రదర్శనలు, సర్టిఫికెట్ కోర్సులు ప్రవేశపెట్టి విద్యార్థుల ఆర్థిక, ఉపాధి అవకాశాలు పెంచుతామని సెంచూరియన్ వర్సిటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్ పాడీ అన్నారు.

బైక్‌పై మృతదేహం తరలింపు


మృతదేహాన్ని ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న దృశ్యం

కొరాపుట్: మృతదేహాన్ని ద్విచక్ర వాహనంపై తరలించిన ఘటన నబరంగ్‌పూర్ జిల్లాలో బుధవారం చోటుచేసుకుంది. రాయిఘర్ సమితి కుందయి గ్రామ పంచాయతీ సభపుర్ గ్రామానికి చెందిన వృద్ధురాలు భానుబాయి రౌత్ (70) సవర్ణపూర్‌కి చెందిన బంధువుల ఇంటికి వెళ్లి అనారోగ్యంతో మృతి చెందారు. అయితే ఆమె మృతదేహాన్ని స్వస్థలానికి తరలించడానికి కుటుంబీకుల వద్ద ఆర్థిక స్తోమత లేదు. దీంతో మృతదేహాన్ని ఇద్దరు వక్తులు జోరు వానలో ద్విచక్ర వాహనంపై తరలించారు. దీనికి సంబంధించిన వీడియో వెలుగులోనికి రావడంతో చర్చనీయాంశమైంది.

సభలో కాగ్ నివేదిక

భువనేశ్వర్: భారత కంప్ట్రోలర్, ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదికను బుధవారం రాష్ట్ర శాసన సభలో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ ప్రవేశపెట్టారు. పలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు, కార్యాచరణ పురస్కరించుకుని చోటు చేసుకున్న నిధుల వినియోగం పట్ల ఈ నివేదిక సంస్కరణలు సూచించింది. ప్రధానంగా నిధుల సద్వినియోగంపై దృష్టి సారించాలని ప్రభుత్వానికి వివరణాత్మకంగా తెలియజేసింది.

ఘనంగా జాతీయ సేవా దినోత్సవం


మాట్లాడుతున్న వర్సిటీ కులపతి దేవీప్రసాద్ మిశ్ర


ఝూన్సీ సింగ్‌ను సన్మానిస్తున్న కులపతి దేవీప్రసాద్ మిశ్ర

జయపురం: జయపురం విక్రమదేవ్ విశ్వవిద్యాలయంలో జాతీయ సేవా యోజన దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. విశ్వవిద్యాలయ సేవా యోజన బ్యూరో నిర్వహించిన ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ కులపతి ప్రొఫెసర్ డాక్టర్ దేవీ ప్రసాద్ మిశ్ర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎన్.ఎస్.ఎస్ తమ సేవల ద్వారా సమాజాన్ని సమైఖ్యపరుస్తోందని ప్రశంసించారు. వర్సిటీ ఎన్ఎస్ఎస్ బ్యూరో కోఆర్డినేటర్ డాక్టర్ మనోరంజన్ ప్రధాన్ మాట్లాడుతూ.. జాతీ య సేవా యోజన బ్యూరో పరిధిలో గల అన్ని కళాశాలల ఎన్.ఎస్.ఎస్‌లు సమాజానికి అందిస్తున్న సేవలను కొనియాడారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్ట ర్ ఝూన్సీ సింగ్‌ను సన్మానించారు. ఎన్ఎస్ఎస్‌లో ఉత్తమ విద్యార్థులకు ప్రశంసాపత్రాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా రిజిస్ట్రార్ మహేశ్వర చంద్రనాయక్, స్నాతకోత్సవ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ ప్రసాంత కుమార్ పాత్రో, ముఖ్యవక్తగా సెమిలిగుడ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఝూన్సీ సింగ్ తదితరులు పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ వాలంటర్లు మద్యపాన నివారణపై చైతన్యపరచే నాటకాన్ని ప్రదర్శించారు.

మహిళా కాంగ్రెస్ విజృంభణ


మీనాక్షి బాహినీపతి నేతృత్వంలో రాష్ట్ర మహిళా కాంగ్రెసు ప్రభుత్వ వ్యతిరేక ఆందోళన


శాసన సభ ముట్టడికి ఉద్యమించిన మహిళా కాంగ్రెసు కార్యకర్తలు

భువనేశ్వర్: రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేకంగా రాష్ట్ర మహిళా కాంగ్రెసు విజృంభించింది. రాష్ట్రంలో సగటు మహిళకు కనీస భద్రత లేదని ఆవేదన వ్యక్తం చేసింది. మహిళలపై పెరుగుతున్న దారుణాలపై ఆగ్రహం వ్యక్తం చేసి దిగువ పీఎంజీ ప్రాంతంలో భారీ ఆందోళన చేపట్టింది. మహిళా కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి బాహినీపతి నేతృత్వంలో పెద్ద సంఖ్యలో మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు ఈ ఆందోళనలో ప్రత్యక్షంగా పాలుపంచుకున్నారు. వారితో మాజీ ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నిరంజన్ పట్నాయక్, జయదేవ్ జెనా పాల్గొన్నారు. వీరంతా శాసన సభను ముట్టడించారు. ఆందోళన ప్రాంతం దిగువ పీఎంజీ మహిళా ఉద్యమకారులతో యుద్ధ భూమిగా మారింది.


ఆందోళనకారులు, పోలీసుల మధ్య ఘర్షణ


దిగువ పీఎంజీ నడి రోడ్డు మీద మహిళా కాంగ్రెస్ ఆందోళన

శాసన సభ ముట్టడి ఊపందుకోవడంతో ఆందోళనకారులు, పోలసు వర్గాల మధ్య ఘర్షణ తీవ్రమైంది. మహిళా కాంగ్రెసు కార్యకర్తలు నడి రోడ్డు మీద పడుకుని ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో పీఎంజీ ప్రాంతాన్ని మారు మోగించారు. పోలీసులు ఆందోళనకారుల్ని అదుపులోకి తీసుకునే ప్రయత్నంలో బారికేడ్లను అధిగమించేందుకు కార్యకర్తలు ఉద్యమించారు.

దొంగలను పట్టించిన రోడ్డు ప్రమాదం

● పోలీసుల అదుపులో నిందితులు


మేకలు దొంగతనం చేసినవారిగా చెబుతున్న నిందితులు

పలాస/శ్రీకాకుళం క్రైమ్: పలాస మండలంలోని మోదుగులపుట్టి గ్రామానికి చెందిన అవుగాన పార్వతీశం, అవుగాన రమణలకు చెందిన సుమారు రూ.1.5 లక్షల విలువైన పెద్ద మేకపోతులను సోమవారం రాత్రి దొంగతనం చేశారు. మోదుగులపుట్టి సమీపంలోని కొత్తపేటలో మేకల మందను వేయగా.. రాత్రిపూట మంద వద్దకు వెళ్లిన నలుగురు వ్యక్తులు దొంగతనం చేసి ఎత్తుకుపోయారు. మోదుగులపుట్టి గ్రామస్తులు, పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. కోసంగిపురం జగనన్న కాలనీ సమీపంలో ఉన్న సోంపేట మండలం గొల్లూరు గ్రామానికి చెందిన ఒక వ్యక్తి, పలాస మండలం అనంతగిరి గ్రామానికి చెందిన ఒక వ్యక్తితో పాటు మరో ఇద్దరు దొంగతనం చేశారు.

పట్టుబడిన దొంగలు

మేకలను దొంగిలించిన నలుగురు యువకులు కారులో శ్రీకాకుళం నగరానికి తీసుకెళ్లి అమ్మేశారు. తిరుగు ప్రయాణంలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొని పోలీసులకు పట్టుబడడంతో విచారణలో అసలు విషయం బయటకొచ్చింది. మంగళవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పలాస మండలంలో మేకలు దొంగతనం చేసిన కె.సాయికుమార్, కె.గణేష్, ఎం.వంశీ, ఎల్.ఛత్రపతిలు ఐదు మేకలను దొంగిలించి, కారులో ఎక్కించి నగరంలోని గుజరాతీపేటలో మటన్ షాపు నిర్వాహకుడికి తక్కువ ధరకు అమ్మేశారు. అనంతరం తిరుగు ప్రయాణంలో హయాతీనగరం వచ్చేసరికి కారు అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నారు. అప్పటికే అక్కడ విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ సిబ్బందికి విషయం పూర్తిగా తెలిసినా డ్రంక్ అండ్ డ్రైవ్‌తో సరిపెట్టేద్దామనుకున్నారు. సమాచారం ప్రత్యేక విభాగ పోలీసులకు అందడంతో చేసేదేమీలేక ట్రాఫిక్ పోలీసులు ఒకటో పట్టణ పోలీసులకు యువకులను అప్పగించారు. దీంతో ఎస్ఐ ఎం.హరికృష్ణ యువకులను ప్రశ్నించగా అసలు విషయాలు బయటకొచ్చాయి. ఎప్పటి నుంచో నగరంలోని ఏడురోడ్ల కూడలి సమీపంలో మంచి పేరున్న మటన్ షాపు నిర్వాహకుడి కుమారుల్లో ఒకరైన రాజు (గుజరాతీపేట షాపునకు) వద్దకు వెళ్లి తక్కువ ధరకు అమ్మారని తెలిసింది. గతంలో కూడా రూరల్ మండలం పాత్రునివలసలో రెండో పట్టణ పరిధి ఇద్దరు రౌడీషీటర్లు గొర్రెలు ఇదే నిర్వాహకుడికి అమ్మడంతో అప్పట్లో కూడా పోలీసులు ఇతడిని విచారించడం గమనార్హం.

జల్సాలకు పోయి జైలుపాలు

శ్రీకాకుళం క్రైమ్: ఎంబీఏ వరకు చదువుకుని.. రంజీ లెవెల్‌లో క్రికెట్ ఆడి.. జల్సాలకు అలవాటుపడి.. ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసై.. చివరికి టెక్కలి పీఎస్ పరిధి గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితుడైన పోలాకి మండలం యవ్వారిపేటకు చెందిన బుడుమూరు నాగరాజుకు బుధవారం శ్రీకాకుళం న్యాయస్థానం నాలుగేళ్ల జైలు శిక్ష విధించింది. జిల్లా ఫస్ట్‌క్లాస్ అడిషనల్ జడ్జి పి.భాస్కరరావు ఈ మేరకు తీర్పు వెలువరించినట్లు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

ఐదున్నర కేజీల గంజాయితో పట్టుబడి..

2023 జనవరి 3న టెక్కలి సమీప జగదిమెట్ట జంక్షన్ ఎన్‌హెచ్–16 రోడ్డులో స్కూటీపై వస్తున్న నాగరాజును అప్పటి ఎస్ఐ ఎల్.రామకృష్ణ తనిఖీ చేయగా డిక్కీలో ఐదున్నర కిలోల గంజాయి పట్టుబడింది. దీంతో నాగరాజు నుంచి స్కూటీ, రెండు ఫోన్లు, ఒక బంగారం ఉంగరం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ గంజాయిని ఒడిశా రాష్ట్రం చీకటి గ్రామ అటవీ ప్రాంత రైతుల వద్ద కొనుక్కొని.. పోలాకిలో అమ్మేందుకు తెస్తుండగా పట్టుబడ్డాడు. దర్యాప్తు అధికారైన అప్పటి టెక్కలి సీఐ ఎస్ సూర్యచంద్రమౌళి (ప్రస్తుతం సీసీఎస్ సీఐ) కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేయగా, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కింజరాపు శ్రీనివాసరావు కేసు వాదించారు. బుధవారం నేరం రుజువైనందున న్యాయమూర్తి నాలుగేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధించారు. జరిమానా కట్టకుంటే మరో ఆరునెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు.

నాగరాజుపై ఎస్‌ఫోర్స్ కేసులు

టెక్కలిలో గంజాయి కేసులో దొరికిన మూడు నెలల తర్వాతనే (బెయిల్‌పై వచ్చి) శ్రీకాకుళం నగర శివార్లలోని శివన్నాయుడుపేట విజయాదిత్య పార్కు వద్ద 23.45 కిలోల గంజాయితో అప్పటి రెండో పట్టణ సీఐ పప్పల శ్రీనివాస్‌కు పట్టుబడ్డాడు. అంతకుముందు 2022లో టెక్కలిలో 48 మద్యం బాటిళ్లతో ఎస్ఐ కామేశ్వరరావుకు, రాజాంలో గంజాయి తరలిస్తూ అక్కడి పోలీసులకు దొరికాడు.

పలు ఛీటింగ్ కేసులు

గతంలో రాజకీయ నాయకుల పీఏనంటూ పలు కంపెనీలకు ఫోన్లు చేస్తూ తన అకౌంట్లకు డబ్బులు వేయించుకున్నాడు. కేర్ ఆస్పత్రి యాజమాన్యాన్ని రూ.60 వేలు మోసగించడతో విశాఖ టూటౌన్‌లో, సెలెక్ట్ మొబైల్ ఎండీ నుంచి రూ.2.88 లక్షలు, విజయవాడ రామకృష్ణ టౌన్‌షిప్ నుంచి రూ.3.88 లక్షలు వసూలు చేసినట్లు కేసులున్నాయి. ఇలా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 25కు పైగా నాగరాజుపై కేసులుండటం విశేషం.

క్లుప్తంగా

జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు వెంకటలక్ష్మి


వెంకటలక్ష్మి

సంతకవిటి: మండలంలోని సిరిపురం పంచాయతీ బలరాంపేట గ్రామానికి చెందిన బోర వెంకటలక్ష్మి గుంటూరులో జరగనున్న జాతీయ స్థాయి సౌత్‌జోన్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైంది. ఈమె గత నెలలో ప్రకాశం జిల్లా చీరాలలోజరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని 3 కిలోమీటర్ల రన్నింగ్‌లో ద్వితీయ స్థానం సాధించి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించింది.

డీఐజీని కలిసిన ఎస్పీ


డీఐజీతో ఎస్పీ దామోదర్

విజయనగరం క్రైమ్: విశాఖ రేంజ్ డీఐజీని ఎస్పీ ఎఆర్ దామోదర్ బుధవారం రేంజ్ కార్యాలయంలో కలిశారు. డీఐజీని కలిసిన ఎస్పీ దామోదర్ మర్యాదపూర్వకంగా పూల మొక్కను ఈ సందర్భంగా అందజేశారు. ఎస్పీగా చార్జ్ తీసుకున్న దామోదర్‌కు డీఐజీ గోపీనాథ్ జెట్టి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో గంజాయి అక్రమ రవాణా నివారణ, సైబర్‌నేరాలు అరికట్టడంపై దృష్టి పెట్టాలని, వాటిపట్ల ప్రజలను అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే రహదారి ప్రమాదాలపట్ల ప్రయాణికులను అప్రమత్తం చేసేలా చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని ఎస్పీకి డీఐజీ స్పష్టం చేశారు.

గిరిజన మహిళకు తీవ్ర గాయాలు

పాచిపెంట: మండలంలో నూతనంగా నిర్మాణం జరుగుతున్న విశాఖపట్నం–రాయపూర్ హరిత రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని గిరిజన మహిళ తీవ్రగాయాల పాలైంది. మంగళవారం రాత్రి జరిగిన ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి, బోడికొండ గ్రామానికి చెందిన సార లక్ష్మి మంగళవారం రాత్రి హరితరహదారి మీదుగా తమ గ్రామానికి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో మహిళ రెండు కాళ్లు విరిగిపోయి తీవ్ర గాయాలయ్యాయి, లక్ష్మి తల్లి దూసరి సన్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకట్ సురేష్ తెలిపారు.

జేఎన్‌టీయూ జీవీ రీసెర్చ్ స్కాలర్‌కు పీహెచ్‌డీ


పీహెచ్‌డీ డిగ్రీ అవార్డు పొందిన కొత్తపల్లి వెంకటేష్

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ జీవీ ఇంజినీరింగ్ కళాశాల మెటలర్జికల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన రీసెర్చ్ స్కాలర్ కొత్తపల్లి వెంకటేష్‌కు పీహెచ్‌డీ డిగ్రీ లభించింది. ప్రొఫెసర్ జి.స్వామి నాయుడు పర్యవేక్షణలో ఆయన పరిశోధన పూర్తి చేశారు. వెంకటేష్ చేసిన పరిశోధనలో అభివృద్ధి చేసిన మెటీరియల్ అధిక బలం, తుప్పు నిరోధకత, ఘర్షణ నిరోధకత కలిగి ఉండడంలో వైమానిక, నౌకాదళ, రక్షణ రంగాల్లో వినియోగానికి దోహదపడనుందని నిపుణులు తెలిపారు. వర్సిటీ నుంచి పీహెచ్‌డీ పొందిన మొట్టమొదటి ఫుల్‌టైమ్ రీసెర్చ్ స్కాలర్‌గా వెంకటేష్ పేరు నమోదైనట్టు స్వామినాయుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వెంకటేష్‌ను ఎన్ఐటీ నాగపూర్ ప్రొఫెసర్ డి.రవికుమార్, పలువురు ప్రొఫెసర్లు అభినందించారు.

ట్రాక్టర్ పైనుంచి పడి బాలుడి మృతి

సాలూరు రూరల్: మండలంలోని గంగన్నదొరవలస వద్ద పొలంలో పనిచేస్తున్న మజ్జి భాను కుమారుడు శివ (3.5 సంవత్సరాలు) ఆడుకుంటూ పక్కనే ఉన్న ట్రాక్టర్ పైకి ఎక్కి జారిపడి మృతి చెందినట్లు రూరల్ ఎస్సై నరసింహ మూర్తి తెలిపారు. బాలుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై చెప్పారు. ఆ సమయంలో తల్లిదండ్రులు పక్కనే ఉన్నారని ట్రాక్టర్ పక్కనే ఉన్న రాయిపై పడిపోవడంతో బాలుడి తలకు గాయమై మృతి చెందినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్సై వివరించారు. బాధితుల సొంత గ్రామం గంజాయి భద్ర పంచాయతీ దూళిభద్ర.

యూరియా కోసం రైతుల పాట్లు

సాలూరు రూరల్: మండలంలోని రైతులు ప్రతిరోజూ యూరియా కోసం పరుగులు తీస్తున్నారు. ఎక్కడ యూరియా దొరుకుతుందోనని తెల్లవారిన దగ్గర నుంచి పొద్దుపోయేవరకు ఒక్క బస్తా యూరియా కోసం యాతన పడుతున్న రైతులు పరిస్థితి చూసిన ప్రతి ఒక్కరు ఇదేం దుస్థితిరా బాబూ అని ముక్కున వేలేసుకుంటున్నారు. మండలంలో ప్రతిరోజూ ఏదో ఒక సచివాలయంలో యూరియా పంపిణీ చేస్తున్నారు. అయితే రైతుకు మాత్రం సరిపడా యూరియా దొరకడం లేదు. ఒక రైతుకు ఒక బస్తా ఇస్తున్నారే తప్ప ఎంత అవసరమో అంత యూరియా మాత్రం ఇవ్వడం లేదు. బుధవారం కొత్తవలస, అన్నం రాజువలస, కరాసువలస, శివరాంపురం రైతు సేవా కేంద్రాల్లో ఒక రైతుకు ఒక బస్తా చొప్పున యూరియా అందజేశారు. తమకు సరిపడా యూరియా ఇవ్వడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సర్కారు వారి ప్రచార హంగామా..!

- టీచర్ పోస్టుల ఆర్డర్ల కోసం 400 కిలోమీటర్లు వెళ్లాలి
- 26న విజయవాడలో నియామక పత్రాల అందజేత
- మండిపడుతున్న ఉమ్మడి జిల్లా డీఎస్సీ అభ్యర్థులు

విజయనగరం అర్బన్: మెగా డీఎస్సీ పేరు చెప్పి అరకొర పోస్టులు భర్తీ చేస్తున్న కూటమి ప్రభుత్వం ప్రచార ఆర్భాటం శృతి మించింది. 150 రోజుల పాటు కసరత్తు చేసి నానాహంగామా సృష్టించి చివరికి పారదర్శకంగా మెరిట్ జాబితాను ప్రకటించలేదని అభ్యర్థుల్లో ఆందోళన కలిగింది. ఇప్పుడు నియామకపత్రాల పంపిణీ పేరుతో మరో హంగామాకు ప్రభుత్వం తెరలేపింది. జిల్లా స్థాయికి పరిమితమైన ఈ పోస్టులకు విజయవాడ రప్పించి నియామక పత్రాలు అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. తొలుత ఈ నెల 19న చేపట్టాల్సిన ఈ కార్యక్రమాన్ని అక్కడ వర్షాల కారణంగా ఈ నెల 25వ తేదీకి పొడిగించారు.

ఉమ్మడి విజయనగరం జిల్లాలో నిర్వహించిన మెగా డీఎస్సీ పరీక్ష ఫలితాల ప్రకటనలో వచ్చిన అనుమానాలను నివృత్తి చేయకుండా ప్రక్రియ కొనసాగడంపై అభ్యర్థులు సందిగ్ధంలో ఉన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రకటించిన తుది ఎంపిక జాబితాపై హెల్ప్ డెస్క్‌కు వచ్చిన వందల సంఖ్యలో సందేహాలు, అనుమానాలు చెప్పుకున్నారు. న్యాయం చేయండి మహాప్రభో అంటూ అధికారుల కాళ్లావేళ్లా పడ్డారు. అయితే అభ్యర్థులకు విద్యాశాఖ అధికారులు ఎలాంటి సమాధానం చెప్పలేని దీనస్థితిలో మిగిలిపోయారు. డీఎస్సీలో నష్టపోయిన అభ్యర్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు కొందరు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే అభ్యర్థులు రాష్ట్రవ్యాప్తంగా 104 కేసులు న్యాయస్థానంలో వేసినట్లు రాష్ట్ర విద్యాశాఖ అధికారుల సమాచారం.

డీఎస్సీ పేరుకు తిలోదకాలు

గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ (డీఎస్సీ) పేరుకు తిలోదకాలిచ్చింది. నిబంధనల ప్రకారం డీఎస్సీ నియామక పోస్టు జిల్లా పరిధికి మాత్రమే వర్తిస్తుంది. పోటీ పరీక్ష జిల్లా అభ్యర్థుల లోకల్ ప్రాతిపదికనే ఎన్నో ఏళ్లుగా జిల్లా స్థాయిలోనే జరిగేది. అయితే ప్రస్తుతం రాష్ట్ర స్థాయిలోనే నిర్వహించడంతో ఈ ప్రక్రియలో పలు అక్రమాలు జరిగాయంటూ అభ్యర్థులు పెదవి విరుస్తున్నారు. ఫలితాలు వెల్లడించిన తర్వాత మెరిట్, రోస్టర్ ప్రకారం విడుదల చేయాల్సిన ఎంపిక జాబితాలో గందరగోళం సృష్టించారు. ఎంపిక జాబితా పేరుతో ఐదు సార్లు ప్రచురించి, కాల్‌లెటర్లు పంపి, సర్టిఫికెట్లు పరిశీలించారు. తీరా తుది జాబితా ప్రచురించే సమయానికి ఎక్కువ ర్యాంక్‌లు వచ్చిన అభ్యర్థులను అనర్హులుగా పేర్కొన్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో వందలాది మంది అభ్యర్థులు నష్టపోయారు.

విజయవాడలో రావాల్సిందే..

మెగా డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు అందజేసే నియామక పత్రాల పంపిణీ కసరత్తును కూటమి ప్రభుత్వం రాజకీయ ప్రచారంగా మలుచుకుంది. జిల్లా పరిధికి చెందిన ఈ పోస్టుల నియామకపత్రాల పంపిణీ ప్రక్రియను రాష్ట్రస్థాయిలో విజయవాడలో నిర్వహించేందుకు సిద్ధమైంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ నిర్ణయం తీసుకోవడంతో విద్యాశాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఎంపికైన అభ్యర్థులతోపాటు కుటుంబ సభ్యులను కూడా విజయవాడకు తీసుకురావాలని విద్యాశాఖ అధికారులు సందేశాలు జారీ అయ్యాయి. ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన 686 పోస్టులకు అభ్యర్థులతోపాటు ఒక్కొక్కరికీ ఒక సహాయవ్యక్తితో మొత్తం 1,374 మందిని విజయవాడకు పంపాలంటూ జిల్లా విద్యాశాఖకు ఆదేశాలు వచ్చాయి. వారి ప్రయాణ ఏర్పాట్ల ప్రక్రియ విజయనగరం డీఈఓ యు.మాణిక్యంనాయుడు పర్యవేక్షణలో సాగుతోంది. ఇందుకు ప్రత్యేకంగా 40 బస్సులను ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో బస్సుకు ప్రధానోపాధ్యాయ స్థాయి ఉద్యోగులు ఇద్దరికి ఇన్‌చార్జ్ బాధ్యతలను అప్పగించి ఈ నెల 25న విజవాడ తీసుకెళ్లడానికి ఏర్పాటు పూర్తిచేశారు. ఈ నెల 24న వారంతా జిల్లా కేంద్రం సమీపాన మోదవలసలోని ప్రైవేట్ పాఠశాలకు హాజరుకావాలని అభ్యర్థులకు నేరుగా సమాచారం పంపారు.

డీఎస్సీ ఎంపిక అభ్యర్థులతో 36 బస్సుల పయనం


జెండా ఊపి బస్సులు ప్రారంభిస్తున్న డీఆర్‌ఓ శ్రీనివాసరావు, డీఈఓ మాణిక్యంనాయుడు

- జెండా ఊపి ప్రారంభించిన డీఆర్‌ఓ శ్రీనివాసమూర్తి

విజయనగరం అర్బన్: డీఎస్సీ–2025లో ఎంపికైన అభ్యర్థుల నియామక పత్రాలను అందుకోవడానికి జిల్లా నుంచి విజయవాడ వెళ్లే బస్సులను స్థానిక మోదవలసలోని ప్రైవేట్ పాఠశాలలో డీఆర్‌ఓ ఎస్.శ్రీనివాసమూర్తి బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన 696 మంది అభ్యర్థులు, వారికి సహాయకారిగా ఒక్కొక్కరు, 20 మంది ఎస్కార్ట్ ఆఫీసర్లు, 12 మంది మెడికల్ ఆఫీసర్లు, ఒక్కో బస్సుకు ఇద్దరు స్కూల్ అసిస్టెంట్ పీడీలు, ప్రతి బస్సుకు ఒకరు చొప్పున పోలీసు సిబ్బంది మొత్తం 1,600 మందితో 36 బస్సులు పయనమయ్యాయని ఈ సందర్భంగా డీఈఓ యూ.మాణిక్యంనాయుడు తెలిపారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ ఎ.రామారావు, డిప్యూటీ ఈఓలు, సెక్టోరియల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బెడిసికొట్టిన టీడీపీ వ్యూహం

- కోరం లేక వీగిపోయిన తీర్మానం

పార్వతీపురం రూరల్: మండలంలోని కృష్ణపల్లి పంచాయతీలో అధికార టీడీపీ వ్యూహం బెడిసికొట్టింది. పంచాయతీ ఉపసర్పంచ్ లంక శ్రీదేవిపై వారు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం, అవసరమైన సభ్యుల కోరం లేకపోవడంతో వీగిపోయింది. కనీస సభ్యుల హాజరును కూడా నిర్ధారించుకోకుండా అవిశ్వాసానికి సిద్ధమవడం, స్థానిక టీడీపీ నాయకత్వ అవగాహనలేమిని, ప్రణాళికా రాహిత్యాన్ని బయటపెట్టిందని రాజకీయ వర్గాల్లో చర్చజరుగుతోంది.

ఏం జరిగిందంటే..?

కృష్ణపల్లి పంచాయతీ దివంగత సర్పంచ్ బోను రామునాయుడు కొద్ది కాలం క్రితం మరణించడంతో, ఉపసర్పంచ్ లంక శ్రీదేవి ఇన్‌చార్జ్ సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆమెను పదవి నుంచి తొలగించేందుకు అధికార టీడీపీకి చెందిన వార్డు సభ్యులు అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చారు. దీనిపై బుధవారం పంచాయతీ కార్యాలయంలో సబ్ కలెక్టర్ డా.ఆర్.వైశాలి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. పంచాయతీలో సర్పంచ్‌తో పాటు 10 మంది వార్డు సభ్యులు ఉండగా, అవిశ్వాస తీర్మానంపై చర్చ జరగాలంటే పంచాయతీరాజ్ చట్టం ప్రకారం 2/3వ వంతు కనీసం ఏడుగురు సభ్యులు సమావేశానికి హాజరు కావాల్సి ఉంది. అయితే, తీర్మానానికి మద్దతిస్తారని భావించిన సభ్యులతో సహా, సమావేశానికి కేవలం ఐదుగురు మాత్రమే హాజరయ్యారు. దీంతో సమావేశానికి కోరం కొరవడిందని, అందువల్ల అవిశ్వాస తీర్మానం వీగిపోయినట్లు సబ్ కలెక్టర్ స్పష్టం చేశారు. సొంతంగా ప్రతిపాదించిన తీర్మానానికే తగినంత మంది సభ్యులను సమీకరించుకోలేకపోవడంతో టీడీపీ నాయకులు అభాసుపాలయ్యారు.


ఉప సర్పంచ్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు హాజరైన వార్డు సభ్యులు

పోలీసు సిబ్బంది కుటుంబాలకు సహాయం

- ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి

పార్వతీపురం రూరల్: పోలీస్ సంక్షేమంలో భాగంగా మరణించిన, ఉద్యోగ విరమణ చేసిన సిబ్బంది కుటుంబాలకు సహాయ సహకారాలు అందజేస్తామని ఎస్పీ ఎస్వీ మాధవ రెడ్డి అన్నారు. ఈ మేరకు పార్వతీపురం మన్యం జిల్లా పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తున్న, ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ ఉద్యోగులు, దివంగత పోలీస్ ఉద్యోగుల కుటుంబసభ్యులతో బుధవారం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయం సిబ్బందితో మాట్లాడుతూ ఎటువంటి నిర్లక్ష్యం లేకుండా అన్ని బెనిఫిట్స్ సకాలంలో అందేలా ఉత్తరప్రత్యుత్తరాలు జరపాలని ఆదేశాలు జారీచేశారు. అనంతరం రిటైర్డ్ పోలీస్ సిబ్బంది, మరణించిన పోలీస్ సిబ్బంది కుటుంబాలకు భోజన వసతి ఏర్పాటు చేసి స్వయంగా ఎస్పీ వారికి వడ్డించి వారితో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ థామస్ రెడ్డి, ఎస్పీ సీఐ రమేష్, ఏఆర్ ఆర్ఐలు నాయుడు, రాంబాబు, ఏఏఓ సతీష్ బాబు, సూపరింటెండెంట్ శంకర రావు, సీసీ సంతోష్, కార్యాలయ సిబ్బంది, మరణించిన పోలీసు ఉద్యోగుల కుటుంబ సభ్యులు, ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


పోలీస్ శాఖ అధికారులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేస్తున్న ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి

కోర్టు చొరవతో బహిరంగ నిరసన



మూలబొడ్డవరలో నిరసన తెలుపుతున్న జిందాల్ నిర్వాసితులు

శృంగవరపుకోట: ఎట్టకేలకు కోర్టు జోక్యంతో జిందాల్ నిర్వాసితులు బుధవారం బహిరంగంగా నిరసన తెలియజేశారు. గడిచిన మూడు నెలలుగా జిందాల్ నిర్వాసితుల నిరసనలకు పోలీసులు అనుమతులు నిరాకరించారు. దీంతో వారు కోర్టును ఆశ్రయించారు. ఎట్టకేలకు నిర్వాసితులు నిరసన తెలిపేందుకు అనుమతించాలని కోర్టు ఆదేశించడంతో పోలీసులు మూలబొడ్డవర రైతు సేవా కేంద్రం వద్ద నిరసన శిబిరం ఏర్పాటుకు నిర్వాసితులను అనుమతించారు. దీంతో బుధవారం నిర్వాసితులు తమ నిరసన శిబిరాన్ని బొడ్డవర నుంచి మూలబొడ్డవరకు మార్చారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ నియంతల్లా వ్యవహరించిన పోలీసులు ఎట్టకేలకు కోర్టు ఆదేశాలతో వెనక్కు తగ్గారన్నారు. రైతుసంఘం నేత చల్లా జగన్ మాట్లాడుతూ తమ డిమాండ్ల సాధన కోసం అటు కోర్టులో, ఇటు బయట తమ పోరాటం కొనసాగిస్తామన్నారు. శాసనమండలిలో జిందాల్ నిర్వాసితుల సమస్యలను ప్రస్తావించిన ఎమ్మెల్సీ రఘురాజుకు ధన్యవాదాలు తెలిపారు.

రైతు సమస్యలపై పోరాటం


రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘ మండలశాఖ అధ్యక్షుడు సింహాచలం

వీరఘట్టం: రైతు సమస్యలపై వ్యవసాయ కార్మిక సంఘం పోరాడుతోందని ఆ సంఘ మండల అధ్యక్షుడు ఎస్. సింహాచలం అన్నారు. మండలంలోని కడకెల్ల గ్రామంలో బుధవారం ఆయన పర్యటించి, రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. శ్రమకు తగ్గ వేతనం రావడం లేదని.. నిత్యావసర సరుకులు, విద్యుత్ చార్జీలు పెరగడంతో జీవనం అతలాకుతలమైందని ఈ సందర్భంగా పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సమస్య పరిష్కారానికి సంఘం తరపున పోరాటం చేస్తామని సింహాచలం చెప్పారు.

• మేము ఏం తప్పచేశాం..


తన ముగ్గురు పిల్లలకు తల్లికి వందనం అందలేదని చెబుతున్న సత్యనారాయణ

మెరకముడిదాం మండలం బుధరాయవలస గ్రామానికి చెందిన నీలాపు సత్యనారాయణ ముగ్గురు పిల్లలు సాయి, గణేష్, హైమావతి గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదుతున్నారు. సత్యనారాయణ భార్య చిన్నమ్మలు 2021లో మృతి చెందింది. అప్పటి నుంచి కూలీనాలీ చేసి పిల్లలను సాకుతున్నానని, ముగ్గురు పిల్లలకు తల్లికి వందనం డబ్బులు అందలేదంటూ సత్యనారాయణ వాపోతున్నాడు. హెచ్ఎం, సచివాలయం సిబ్బంది చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకపోతోందని ఆవేదన వ్యక్తంచేశాడు. గతంలో అమ్మఒడి అందేదని, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పథకం వర్తింపజేయాలంటూ వేడుకుంటున్నాడు. – మెరకముడిదాం

సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీలో ఘనంగా వరల్డ్ టూరిజం డే

విజయనగరం అర్బన్: కేంద్రీయ గిరిజన యూనివర్సిటీలోని టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం వరల్డ్ టూరిజం డే–2025 ఉత్సవాలు ఘనంగా జరిగాయి. పర్యాటక రంగం సుస్థిరత, సృజనాత్మకత, సాంస్కృతిక మార్పిడి రంగాల్లో పోషించే కీలక పాత్రను ఈ వేడుకలు ప్రతిబింబించాయి. రెండురోజుల పాటు జరిగిన కార్యక్రమాల్లో సృజనాత్మకతను ప్రోత్సహిస్తూ స్లో సైకిల్ రేస్, పోస్టర్ పోటీ, వేస్ట్ టు వండర్స్ వంటి వినూత్న పోటీలు విద్యార్థులకు నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జితేంద్ర మోహన్ మిశ్రా మాట్లాడుతూ భవిష్యత్తు నిపుణులను సుస్థిర దృక్పథంతో తీర్చిదిద్దడం ద్వారా పర్యాటక రంగం మరింత బలోపేతం అవుతుందన్నారు. అనంతరం వినూత్న పోటీల విజేతలకు జ్ఞాపికలు, బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో బోధన సిబ్బంది ప్రతాప్ కేశరి దాస్, డాక్టర్ అప్పాసాబా, డాక్టర్ కుసుమ్, డాక్టర్ గంగునాయుడు మండల, యూనివర్సిటీ లైబ్రేరియన్ డాక్టర్ శంకర్ రెడ్డి కోలే, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


వేస్ట్ టు వండర్స్ ప్రదర్శనలో విద్యార్థులు

తపాలా బీమా లక్ష్యం రూ.1550 కోట్లు

- పోస్టల్ ఎ.డి శివనాగరాజు

బొబ్బిలి: రాష్ట్రంలో తపాలా బీమా లక్ష్యం ఈ ఏడాది రూ.1550కోట్లుగా నిర్ణయించినట్లు ఆ శాఖ ఎ.డి జి.శివనాగరాజు తెలిపారు. ఈ మేరకు బొబ్బిలిలో డివిజన్ స్థాయిలో మూడు రోజుల జరగనున్న సేవింగ్స్ పోస్టల్ మేళాను ర్యాలీతో బుధవారం ప్రారంభించారు. పార్వతీపురం పోస్టల్ సూపరింటెండెంట్ రెడ్డి బాబూరావు అధ్యక్షతన ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతేడాది లక్ష్యాన్ని 95 శాతం చేరుకున్నామన్నారు. దీనికి 30 శాతం అదనంగా ఈ ఏడాది లక్షాన్ని నిర్దేశించుకున్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న మూడు రోజుల మేళాలో రూ.30 కోట్ల బీమా సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నామన్నా రు. ఇందులో భాగంగా మొదటిరోజునే రూ.10కోట్ల వ్యాపార లక్ష్యం పూర్తయిందని తెలిపా రు. లక్ష రూపాయల ప్రీమియం సాధించిన ఉద్యోగులకు సీజీఎం చేతుల మీదుగా ఘన సత్కారం చేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 25లక్షల మందికి బీమా చేశామని, పార్వతీపురం డివిజన్‌లో రూ.కోటి 25లక్షల బీమా ప్రీమియం లక్ష్యం కాగా దానిని మించి వ్యాపారం చేయడం సంతోషమన్నారు. జీఎస్‌టీ లేకుండా బీమా సదుపాయం కల్పిస్తున్నామన్నారు. ఏఎస్పీలు ఎం.సత్యనారాయణ, ఐ.మురళి మాట్లాడుతూ రూ.550తో రూ.10లక్షల బీమా, రూ.2,199 ప్రీమియంతో కుటుంబ సభ్యులందరికీ రూ.15లక్షల ఆరోగ్య బీమాను అందజేయనున్నామని తెలిపారు. ఈ సందర్భంగా బీమా ప్రీమియం సేకరణ లక్ష్యాలను సాధించిన వారిని మెమెంటోలతో సత్కరించి అభినందించా రు. ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు, జీడీఎస్‌లు, బీపీఎంలు, ఏబీపీఎంలు కార్యక్రమంలో పాల్గొన్నారు.


బెస్ట్ ఫెర్‌ఫార్మర్ పీవీ వేణు గోపాలరావుకు మెమెంటో అందజేస్తున్న పోస్టల్ ఎ.డి శివనాగరాజు

వైద్యరంగంలో ఫార్మసిస్టులు కీలకం

- వైద్యుల తర్వాత అంతటి ప్రాధాన్యం
- రోగులకు అందించింది వారే
- నేడు ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం


ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో రోగులకు మందులు అందజేస్తున్న ఫార్మసిస్టులు

విజయనగరం ఫోర్ట్: వైద్యరంగంలో ఫార్మసిస్టుల పాత్ర చాలా కీలకమైనది. వైద్యుల తర్వాత అంతటి ప్రాధాన్యం వారిదే. రోగి వ్యాధి తగ్గించడంలో వైద్యుడి పాత్ర ఎంత ఉంటుందో, ఫార్మసిస్టు పాత్ర కూడా అంతే ఉంటుంది. రోగిని పరీక్షించిన వైద్యుడు వ్యాధి తగ్గడానికి అవసరమైన మందులు రాసి ఇస్తారు. వైద్యుడు సూచించిన మందులను చూసి మార్చకుండా కచ్చితమైన మందులు అందించేది ఫార్మసిస్టులే. గురువారం ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం.

వ్యాధిని తగ్గించడంలో ఫార్మసిస్టులే కీలకం

రోగికి మందులు అందించడం ద్వారా ఫార్మసిస్టులు వ్యాధిని తగ్గిస్తారు. అయితే మందులు అందించడంలో ఫార్మసిస్టులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంటుంది. వైద్యుడు సూచించిన మందులు ఒకదానికి బదులు ఇంకొకటి ఇచ్చినా, కాలపరిమితి దాటిన మందులు అందించినా రోగుల ప్రాణాల మీదికి వస్తుంది. కోవిడ్‌సమయంలో ఫార్మసిస్టులు వైద్యులతో సమానంగా వారితో కలిసి కోవిడ్ బారిన పడిన వారికి మందులు అందించారు. ప్రపంచంలో మొదటి సారి 2009 సెప్టెంబర్ 25న ఫార్మసిస్టుల దినోత్సవాన్ని నిర్వహించారు. భారత దేశంలో 2013 లో ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సెప్టెంబర్‌లో ఫార్మసిస్టుల దినోత్సవాన్ని నిర్వహించేందుకు అనుమతి ఇచ్చింది. 2014లో సెప్టెంబర్ 25నుంచి మన దేశంలో ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

ఫార్మసిస్టులు చేసే పనులు

మందులు నిల్వ చేస్తారు. అదేవిధంగా వ్యాక్సిన్‌ను నిర్దేశించిన ఉష్ణోగ్రతలో నిల్వ చేయడం. సెంట్రల్ డ్రగ్ స్టోర్స్‌లో పనిచేసే ఫార్మసిస్టులు పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రి, జిల్లా ఆస్పత్రులకు మందులు పంపిణీ చేస్తారు. ఆయా ఆస్పత్రుల్లో పనిచేసే ఫార్మసిస్టులు వైద్యులు రాసి ఇచ్చిన చీటీ ప్రకారం రోగులకు మందులు అందిస్తారు. అదే విధంగా ఆయా ఆస్పత్రులకు ఎన్ని రకాలు మందులు? ఎంత కావాలో? ఆన్‌లైన్‌లో ఇండెంట్ పెడతారు. అలాగే మందులు ఇచ్చే మందు రోగులకు ఫార్మసిస్టులు కౌన్సెలింగ్ ఇస్తారు. ఏ రకం మందు ఏ సమయంలో ఎంత మోతాదులో వేసుకోవాలో వివరంగా తెలియజేస్తారు.

జిల్లాలో 1500మందికి పైగా ఫార్మసిస్టులు

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు, మందులు దుకాణాలు అనేకం ఉన్నాయి. పీహెచ్‌సీలు 50 ఉన్నాయి. అదేవిధంగా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 18 ఉన్నాయి. సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు ఏడు ఉన్నాయి. బోధనాస్పత్రి, ఘోషా ఆస్పత్రి ఒక్కొక్కటి ఉన్నాయి. అదేవిధంగా 800 వరకు మందులు దుకాణాలు, 200 నుంచి 300 వరకు క్లినిక్స్, నర్సింగ్ హోమ్స్ ఉన్నాయి. వాటిల్లో 1500 మందికి పైగా ఫార్మసిస్టులు పనిచేస్తున్నారు.

మందులు ఇచ్చేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి



వైద్యులు సూచించిన మందులు రోగులకు అందించేటప్పుడు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలి. మందుల కాలపరిమితి, బ్యాచ్ నంబర్ చూసుకోవాలి. ఎట్టిపరిస్థితుల్లోనూ కాలం చెల్లిన, రంగు మారిన మందులు రోగులకు అందించకూడదు. రోగులు మందులు ఏవిధంగా , ఏసమయంలో వేసుకోవాలో కౌన్సెలింగ్ నిర్వహించి మందులు అందజేయాలి. **బైల పూడిసన్యాసినాయుడు,**
రాష్ట్ర ఫార్మసిస్టుల సంఘం ఉపాధ్యక్షుడు

రోగుల పట్ల చిరాకుపడకూడదు



జిల్లా ఆస్పత్రికి, బోధనాస్పత్రికి రోగులు ప్రతిరోజూ వేలాది మంది వస్తారు. అయితే తొందరగా వెళ్లి పోవాలనే ఆలోచనతో వారు మందులు త్వరగా ఇవ్వాలని అడుగుతుంటారు. అటువంటి వారి పట్ల చిరాకు పడడం, విసుక్కోవడం చేయకూడదు. ఓపిగ్గా వారికి మందులు అందించి అవి ఏవిధంగా వాడాలో చెప్పాలి. వృద్ధులు, దివ్యాంగులకు త్వరగా మందులు అందించాలి. ఫార్మసిస్టులు ఆరోగ్య రంగంలో మూల స్తంభం లాంటి వారు. మందులు అందించడం ద్వారా ప్రజలకు సేవ చేసే అదృష్టాన్ని భగవంతుడు తమకు ఇచ్చిన వరంగా ప్రతి ఫార్మసిస్టు భావించాలి. **బమ్మిడి నరసింగరావు,**
ఫార్మసీ ఆఫీసర్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి